అత్వెల్లి పాఠశాలలో యోగా శిబిరం



అత్వెల్లి యోగా శిబిరంలో యోగాసనాలు వేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం 11 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి పాఠశాలలో బీజేపీ నాయకులు సోమవారం యోగా శిబిరం నిర్వహించారు. యోగా గురువులు శిబిరానికి విచ్చేసి హాజరైన వారికి యోగాలో శిక్షణ ఇచ్చారు. మరో రెండు రోజుల పాటు ఉచిత శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో బీజేపీ నాయకులు ప్రేందాస్, ఈశ్వర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామలింగేశ్వర సివిల్ కాంట్రాక్టర్స్ నూతన కార్యవర్గం



శ్రీరామలింగేశ్వర సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ శ్రీరామలింగేశ్వర సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా సింగోజి నర్సింహచారి, ఉపాధ్యక్షులుగా పల్లపు రమేష్, బత్తుల సైదులు, సెక్రటరీగా రావుల శ్రీను, జనల్ సెక్రటరీగా శివరాత్రి రాజు, క్యాషియర్‌గా కృష్ణ, కన్వీనర్‌గా బలరాం, గౌరవ అధ్యక్షుడిగా పల్లపు శ్రీను, సలహాదారుగా రామ్‌రెడ్డి, వెంకటయ్య, కొమురయ్య, షేక్ ఆజి, శంకరయ్య, సత్తయ్య, లింగారెడ్డి, క్రాంతికుమార్, రంగారెడ్డి, శ్రీను నియమితులయ్యారు.

బీరప్పగడ్డలో రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బీరప్పగడ్డ వాసులు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ బీరప్పగడ్డలో రోడ్డు ఆక్రమణకు గురవుతోందని, పారిశుద్ధ్య పనులపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు సోమవారం ఉప్పల్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆంజనేయులకు ప్రజావాణిలో వినతి పత్రాన్ని అందజేశారు. నాలాపై నిర్మాణాలు చేపడుతున్నారని, వెంటనే వాటిని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, శివకుమార్, లక్ష్మీనారాయణ, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కాలనీకి సీసీ రోడ్డు



న్యూరాంనగర్ కాలనీలో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత తదితరులు

ఉప్పల్: ప్రతి కాలనీ, బస్తీకి సీసీ రోడ్డు వేయించనున్నట్లు చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. న్యూరాంనగర్ కాలనీలో రూ.12 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండే విధంగా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ రోడ్లను వేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేత బన్నాల ప్రవీణ్, డీఈ వెన్నెల, జగన్, శ్రీనివాస్ తదిరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత



నాగరాజు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు

అల్వాల్: జీహెచ్‌ఎంసీ అల్వాల్, మల్కాజిగిరి సర్కిళ్లలో ఎస్‌ఎఫ్‌ఐగా పనిచేసే నాగరాజు ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు నాగరాజు కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేయగా కార్పొరేటర్లు రాజ్ జితేంద్రనాథ్, ప్రేమ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, లక్ష్మీకాంత్ రెడ్డి, ఏ–బ్లాక్ అధ్యక్షుడు నిమ్మ అశోక్‌రెడ్డి, బీ–బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, శ్రీనివాస్, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రారండోయ్.. ఎంజాయ్ చేద్దాం..

నగరవాసులను ఆహ్వానిస్తున్న శివారు ప్రాంతాలు | సెలవు రోజుల్లో కుటుంబాలతో కలిసి ప్లాన్ | కిటకిటలాడుతున్న పార్కులు, రిసార్ట్‌లు

మూడువైపులా విస్తరించిన మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా

కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో నివసిస్తున్న ప్రజలు వీకెండ్ వచ్చిందంటే చాలు నగర శివారు ప్రాంతాలకు ప్రయాణం చేస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఉదయమే ఆయా ప్రాంతాలకు వెళ్తున్నారు. ప్రకృతి ఒడిలో సేదతీరుతున్నారు. చిన్నాపెద్దా మరిచిపోయి సంతోషంగా గడుపుతున్నారు. గుండెల నిండా 'ఆక్సిజన్' నింపుకొని.. కళ్లలో పచ్చదనాన్ని దాచుకొని.. ఉత్సాహంగా ఆడిపాడి.. రిసార్ట్స్‌లోని స్విమ్మింగ్ పూల్స్‌లో జలకాలాడి సంతోషంగా ఇళ్లకు చేరుకుంటున్నారు. దీంతో ఆయా ప్రాంతాలు పర్యాటక శోభను సంతరించుకుంటున్నాయి.

– మేడ్చల్

మేడ్చల్ నియోజకవర్గంలో ప్రభుత్వం అభివృద్ధి చేసిన కండ్లకోయ ఆక్సిజన్ పార్క్, నారపల్లి నందన వనం, జటాయువు పార్క్, కీసరగుట్ట వనం, నాగారం ఆరోగ్యవనం(లంగ్స్ పార్క్)తో పాటు శామీర్‌పేట్‌లోని జింకల పార్క్, తెలంగాణ టూరిజం రిసార్ట్‌లతో పాటు శామీర్‌పేట్ మండలంలో ప్రఖ్యాత రిసార్ట్‌లు నగరవాసులను అమితంగా ఆకర్షిస్తున్నాయి.

పార్కులలో అన్ని వసతులు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్క్‌లలో అన్ని వసతులు కల్పించారు. వాకింగ్ ట్రాక్, ఫొటో షూట్ పాయింట్స్, పిల్లలు ఆడుకునేందుకు వసతులు కల్పించారు. 50 నుంచి 70 ఎకరాలలో పార్క్‌లను అభివృద్ధి చేసి కుటుంబ సమేతంగా గడిపేందుకు ఏర్పాట్లు చేశారు.

శామీర్‌పేట్ రిసార్ట్స్‌లో ఫుల్ ఎంజాయ్

ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న శామీర్‌పేటలో రిసార్ట్స్, ప్లే జోన్స్, లేక్ వ్యూ, గార్డెన్ వ్యూ కాటేజెస్ పర్యాటకులను ఆహ్వానిస్తున్నాయి. శామీర్‌పేట పెద్ద చెరువు, కట్టమైసమ్మ ఆలయానికి భక్తులు, టూరిస్ట్‌లు అధికసంఖ్యలో వస్తున్నారు. శామీర్‌పేట మండల పరిధిలో సమ్మర్ గ్రీన్ రిసార్ట్, అలంకృత రిసార్ట్, లియోనియా హోలిస్టిక్ డెస్టినేషన్, సెలెబ్రిటీ రిసార్ట్, డిస్ట్రిక్ట్ గ్రావిటీ గేమ్స్ జోన్‌లో ప్రత్యేక ప్యాకేజీలను అందిస్తున్నాయి.

కీసరగుట్టలోని హుడా పార్కు

ప్రఖ్యాత శైవ క్షేత్రం కీసరగుట్ట శ్రీభవానీరామ లింగేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చే భక్తులు స్వామివారి దర్శనం తర్వాత కీసరగుట్ట ప్రధాన ఆలయం దిగువన ఉన్న హుడా పార్కు (శ్రీరామ లింగేశ్వరస్వామి దేవస్థానం ఉద్యానవనం)లో గడుపుతున్నారు. కుటుంబ సమేతంగా భోజనాలు చేస్తున్నారు. ఇక్కడ ఉన్న పెద్ద మర్రిచెట్లు ఆకట్టుకుంటున్నాయి.



నారపల్లిలోని భాగ్యనగర నందనవనం పార్కు

నారపల్లి భాగ్యనగర నందనవనం

భాగ్యనగర నందనవనంలోని జింకల పార్కు ప్రత్యేక ఆకర్షణ. 118 ఎకరాలలో విస్తరించిన నందనవనంలో 1.5 కిలో మీటర్ల వాకింగ్ ట్రాక్ ఉంది. రకరకాల ఆట వస్తువులతో ఏర్పాటు చేసిన ప్లే గ్రౌండ్‌లో పిల్లలు ఆడుకోవడానికి ఎక్కువగా వస్తున్నారు. పచ్చదనం పరుచుకున్న వాతావరణం ప్రజలకు ఆహ్లాదం పంచుతోంది. నిత్యం 200 నుంచి 300 వరకు సందర్శకులతో పార్కు సందడిగా ఉంటోంది. జింకల గుంపులతో పాటు పెద్ద సంఖ్యలో నెమళ్లు కనిపిస్తుంటాయి. పక్షుల రాగాలతో సందర్శకులు ఫిదా అవుతున్నారు.

కండ్లకోయ ఆక్సిజన్ పార్క్‌లో ఆహ్లాదం

కండ్లకోయలోని ఆక్సిజన్ పార్క్‌లో ప్రత్యేకంగా విదేశీ పక్షులు పెంచుతున్నారు. ఈ పార్క్‌లో ప్రజల కోసం వాకింగ్ పాత్‌వే, యోగా సెంటర్, గెజీబో, వాటర్ ఫౌంటెయిన్, రచ్చబండ తదితర ఏర్పాట్లు చేశారు. అటవీ ప్రాంతం ఫీల్ వచ్చేలా కర్రలతో బ్రిడ్జీలు ఏర్పాటు చేశారు. నాగారం ఆరోగ్యవనంలో సుమారు 40 ఎకరాల్లో వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు.





కండ్లకోయలోని ఆక్సిజన్ పార్కు



ఆక్సిజన్ పార్కులో వాక్ వే



నారపల్లిలోని భాగ్యనగర నందనవనం పార్కులో..



శామీర్‌పేట్ పెద్ద చెరువు

అక్రమంగా రేకుల రూముల కూల్చివేత

చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఏకశిలానగర్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు రెండు ప్లాట్లలో నిర్మించిన రేకుల రూములు, ప్రహరీ గోడలను సోమవారం తెల్లవారుజామున అక్రమంగా కూల్చివేశారు. ప్లాట్ల హద్దురాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాల క్రితం తమ ప్లాట్లలో నిర్మించిన గదులతో పాటు ప్రహరీ గోడలను కూల్చివేశారని వాపోయారు. ప్రైవేట్ ఆస్తులను ధ్వంసం చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని చెప్పారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని బాధితులు తెలిపారు. సమావేశంలో బాధితులు రాజ్యలక్ష్మి, కవిత, రజిత, రాంరెడ్డి, శ్రీనివాసాచారి, బాలరాజ్, ధర్మేందర్‌తో పాటు ఏకశిలానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు చెరుకు శివారెడ్డి, యాదగిరి, వేణు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాధితులు

బ్యాంకులో సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక కౌంటర్ కావాలి



వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు

పోచారం: చౌదరిగూడలోని ఎస్‌బీఐ బ్రాంచిలో సీనియర్ సిటిజన్ల సౌకర్యార్థం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ బ్రాంచ్ మేనేజర్‌కు తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీరయ్య, ప్రధాన కార్యదర్శి వేణు మాధవ్ సోమవారం వినతిపత్రం అందజేశారు. స్కాలర్‌షిప్పులు తీసుకునే విద్యార్థులు, పింఛనుదారులు, వ్యాపారస్తులు, సామాన్య ప్రజలతో బ్యాంకు రద్దీగా ఉంటంతో సీనియర్ సిటిజన్లు క్యూలో ఎక్కువ సమయం వేచి ఉంటాల్సి వస్తోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. అందుకే సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక కౌంటర్ కావాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సంజీవ్‌రెడ్డి, రాజనర్సు, మల్లయ్య, లక్ష్మీనారాయణ, ప్రతాప్‌సింగ్, ప్రభాకర్, సర్జిత్ సింగ్, కాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ కొకూర్‌లో ఫార్చ్యూన్ ఎన్‌క్లేవ్‌లో బాక్స్ డ్రైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్చ్యూన్ ఎన్‌క్లేవ్‌లో డ్రైనేజీ అవుట్‌లెట్ లేకపోవడంతో డ్రైనేజీ రోడ్లపై నిలవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ బాక్స్ డ్రైన్‌తో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు గౌతమ్, వినోద్ గౌడ్, సీతారామరాజు, సోమోజి, భుజంగరావు, సంతోష్, రవికాంత్, శ్రీను, బీఆర్‌ఎస్ నాయకులు డోలి రమేష్, నరేందర్‌రెడ్డి, శోభన్‌బాబు, లక్ష్మణ్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్, సందీప్‌రెడ్డి, హనుమాన్‌చారి, తిరుపతయ్య, సతీష్, మల్లేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కొకూర్‌లో ఫార్చ్యూన్ ఎన్‌క్లేవ్‌లో బాక్స్ డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

అభివృద్ధి పనులకు నిధులివ్వండి

గౌతంనగర్: మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సోమవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇందుకు కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ సానుకూలంగా స్పందించి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, నాయకులు అనిల్ కిషోర్‌గౌడ్, డోలి రమేష్, నరేందర్, వెంకన్న, రాముయాదవ్, అనిల్, రాములు, కిట్టు, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

మల్లాపూర్: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం బడీడు పిల్లలు బడిలో చేరాలని మల్లాపూర్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పద్మారావు మాట్లాడుతూ.. పిల్లలను బడిలో చేర్పించి ఉన్నత విద్యావంతులుగా తీర్చిద్దేందుకు దోహదపడాలని తల్లిదండ్రులను కోరారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం, ఏఐ ద్వారా బోధన వంటివి ప్రభుత్వం పాఠశాలలో ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సారథి, శ్రీదేవీ, సీమారాణి, లక్ష్మీ,అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, వాణి,కరుణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కేవీరెడ్డి నగర్, గోద్రేజ్, కండ్లకోయ 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గోద్రేజ్ ఇండస్ట్రియల్ లైన్, కేవీరెడ్డి నగర్ వార్డు, మైపీ, ఆంథమ్ విల్లాస్, కండ్లకోయ, రైల్వే ట్రాక్ రోడ్డు, సుతారిగూడ ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మేడ్చల్‌రూరల్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పారిశ్రామికవాడలోని శ్రీనాథ్ స్పిన్నింగ్ మిల్ సమీపంలో ఈ నెల 5న రాత్రి గుర్తుతెలియని వ్యక్తి పడి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న మేడ్చల్ పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు 55–60 ఏళ్ల మధ్య వయస్సు ఉంటాడని, భిక్షాటన చేసే వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



హరీష్ కుమార్‌రెడ్డి(ఫైల్)

శామీర్‌పేట్: ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేని వ్యక్తిపై శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో సోమవారం మిస్సింగ్ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కడప జిల్లా, కొండాపురం మండలానికి చెందిన కంచిమిరెడ్డి హరీష్ కుమార్‌రెడ్డి(32), తూంకుంట మున్సిపాలిటీలో తన భార్యతో నివసిస్తూ కర్కపట్లలోని ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నారు. ఈ నెల 8న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఉప్పల్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగోల్ మెట్రోస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి వయస్సు 40 నుంచి 45 వరకు ఉన్న వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించిన స్థానికులు ఉప్పల్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 108 అంబులెన్స్ పిలిపించి పరిశీలించగా సదరు వ్యక్తి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించడంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భూ సమస్యల పరిష్కానికే రెవెన్యూ సదస్సులు

పోచారం: భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని అంకుశాపూర్, పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ముత్వెల్లిగూడలో సోమవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. అంకుశాపూర్‌లో జరిగిన రెవెన్యూ సదస్సును ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం సదస్సులు కొనసాగుతున్నాయన్నారు. అంకుశాపూర్‌లో 63, ముత్వెల్లిగూడలో 21 అర్జీలను భూయజమానుల నుంచి స్వీకరించినట్లు తహసీల్దార్ రజిని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రాజేందర్, సీనియర్ అసిస్టెంట్ ఆదిత్య, ఆర్‌ఐలు కావ్యారెడ్డి, సాయిరామ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అంకుశాపూర్‌లో రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

శామీర్‌పేట: భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని తహసీల్దార్ యాదగిరిరెడ్డి అన్నారు. తూంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేట్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 100 అర్జీలు వచ్చాయని, అదేవిధంగా డిప్యూటీ తహసీల్దార్ సంయుక్త ఆధ్వర్యంలో అలియాబాద్‌లో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 85 అర్జీలు వచ్చాయని తెలిపారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధి కొల్తూర్‌లో తహసీల్దార్ వెంకట నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 63 అర్జీలు రాగా, డిప్యూటీ తహసీల్దార్ అనూష రెడ్డి ఆధ్వర్యంలో అద్రాస్‌పల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 73 అర్జీలు వచ్చాయి. మరో మూడు రోజులు పాటు రెవెన్యూ సదస్సులు వివిధ గ్రామాలలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్లు తెలిపారు. సమస్యలు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఎగురవేస్తున్న ఎస్టీయూ నాయకులు

మేడ్చల్: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని మేడ్చల్‌లోని సంఘం కార్యాలయంలో ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో జాతీయ జెండాను, సంఘం జెండాను ఆవిష్కరించి 78 ఏళ్లుగా ఉపాధ్యాయుల కోసం, విద్యా వ్యవస్థ కోసం సంఘం చేసిన సేవల ను స్మరించుకున్నారు. సాధించిన విజయాలను వక్తలు తమ ప్రసంగంలో ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేంకుమార్, సంఘం నాయకులు లక్ష్మణమూర్తి, శిరీష, నీరజ, కృష్ణారెడ్డి, విఠల్, మోహన్ పాల్గొన్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా మన్యం

పోచారం: భారతీయ జనతా పార్టీ ఘట్‌కేసర్ మండల ప్రధాన కార్యదర్శిగా గొబ్బిరి మన్యం నియమితులయ్యారు. ఈమేరకు నియామక పత్రాన్ని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ సోమవారం అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. పార్టీని బలోపేతం చేయడానికి అలుపెరుగని సైనికుడిగా పనిచేయాలన్నారు. అనంతరం మన్యం మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధిష్టానం చేపట్టే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటానన్నారు. పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేస్తానని స్పష్టం చేశారు.



మన్యంను శాలువా కప్పి సన్మానిస్తున్న ఎంపీ రాజేందర్

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

అల్వాల్: కాలనీ అభివృద్ధికి ఉన్న అడ్డంకులను తెలపాలని కోరుతూ కానాజిగూడ హరిత ఎన్‌క్లేవ్ వాసులు అధికారులను కోరారు. కానాజిగూడ సర్వే నంబర్–374లో ఏర్పాటైన హరిత ఎన్‌క్లేవ్‌లో ఇటీవల భవన నిర్మాణ అనుమతులు ఇవ్వడం లేదని ఇందుకు గల కారణాలు తెలపాలని అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, అల్వాల్ మండల తహసీల్దార్ రాములును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీకి సంబంధించిన అన్ని రెవెన్యూ రికార్డులను కోర్టు పత్రాలను అధికారులకు అందజేసినట్లు కాలనీ ప్రతినిధులు తెలిపారు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



తహసీల్దార్ రాములుకు వినతిపత్రం అందజేస్తున్న కానాజిగూడ హరిత ఎన్‌క్లేవ్‌వాసులు